ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.80 (299.7430)	నిల్	14,697
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	1,031.82	723.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

యథావిధిగా ప్రజాదర్బార్



భువనగిరి(కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి):కలెక్టరేట్‌లో ప్రతీ గురువారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ఎం.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం అనివార్య కారణాలతో రద్దయిన ప్రజాదర్బార్ ఈ వారం నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ఉద్యోగ వాణి ద్వారా అర్జీలను స్వీకరిస్తామన్నారు.

లక్కీడ్రాలు చట్ట వ్యతిరేకం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): లక్కీ డ్రాలు నిర్వహించడం చట్ట వ్యతిరేకమని సీఐ మన్మథకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆశను ఆసరాగా చేసుకొని కొంత మంది చౌటుప్పల్ ప్రాంతంలో ప్లాట్లు, బైక్‌ల పేరుతో లక్కీ డ్రాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కొద్ది డబ్బు చెల్లిస్తే ప్లాట్లు, కార్లు, బైక్ గెలుచుకోవచ్చని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలను మోసగిస్తూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చన

- నృసింహుడికి విశేష పూజలు 7



పంచాయతీ ఎన్నికలకు రేస్

గ్రామపంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహుల్లో మళ్లీ సందడి మొదలైంది. సెప్టెంబరులోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా, రిజర్వేషన్ల పరిధి 50శాతం దాటడంతో హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ ఆమోదం పొందకపోవడం, హైకోర్టులోనూ కేసులు కొనసాగుతుండడంతో ఎన్నికలు నిలిచి పంచాయతీలకు పాలకవర్గాల్లేని పరిస్థితి కొనసాగుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- బీసీ డెడికేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్లు
- నెలాఖరులోగా కొత్త రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం
- ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే సిద్ధమైన అధికార యంత్రాంగం

రాష్ట్రంలో సుమారు రెండేళ్లుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్‌పడింది. వచ్చే మార్చి నెలాఖరుకు 16వ కేంద్ర ఆర్థిక సంఘం గడువు ముగియనుండడంతో, ఈలోగా పాలకవర్గాలు కొలువుదీరకపోతే రాష్ట్రంలోని పంచాయతీలకు రావాల్సిన సుమారు రూ.3వేల కోట్ల నిధులు వెనక్కివెళ్లే ప్రమాదం నెలకొంది. దీంతో డిసెంబరు నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.

నెలాఖరుకు రిజర్వేషన్లు వెలువడే ఛాన్స్

కోర్టు తీర్పు రాకమునుపే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించడంతో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనే అంశంలో బీసీ డెడికేషన్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సలహా కోరింది. వారం లోగా ఈ కమిషన్ నుంచి సూచనలు వచ్చాక, అందుకు అనుగుణంగా పంచాయతీలు, వార్డులకు అధికారిక రిజర్వేషన్లు పునఃకేటాయింపు చేస్తారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు గరిష్ఠంగా 50శాతానికి లోబడి రిజర్వేషన్లు ఇచ్చే క్రమంలో బీసీలకు 25శాతం, ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్లు అధికారికంగా కేటాయిస్తారని తెలుస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం బీసీ అభ్యర్థులను రిజర్వేషన్లకు మించి 42 శాతానికి తగ్గకుండా కేటాయిస్తారని సగటున 50శాతానికి మించి బీసీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించేందుకు పార్టీపరంగా సన్నద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. సెప్టెంబరులో ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, మహిళల రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగిస్తూ, బీసీలకు ఇచ్చిన 42శాతం సీట్లలో డెడికేషన్ కమిషన్ సూచించే ప్రకారం రిజర్వేషన్లు ఉండనున్నాయి. ఏ ప్రాతిపదికన అధికారిక సీట్లలో 25శాతానికి మించి ఉన్న కేటగిరీలను తొలగించాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఎస్సీ, ఎస్టీ స్థానాలు సహా బీసీలకు సైతం మళ్లీ తాజాగా జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. డెడికేషన్ కమిషన్ సిఫారసుల ఆధారంగానే తాజా రిజర్వేషన్ల ప్రకటన ఉండనున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులు మాత్రం ప్రభుత్వం ఏ విధంగా సూచిస్తే ఆ విధంగా రిజర్వేషన్లు కేటాయించేందుకు అవసరమైన కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకొని ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. గరిష్ఠంగా ఈ నెలాఖరులోగా పంచాయతీల రిజర్వేషన్ల కేటాయింపు పూర్తవుతుందని భావిస్తున్నారు.

సిద్ధమైన అధికార యంత్రాంగం

జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ప్రాథమిక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సర్వం సిద్ధం చేసింది. నల్లగొండ జిల్లాలోని 33 మండలాల్లోని 869 పంచాయతీలకు, 7,494

- మిగతా 7వ పేజీలో...

జిల్లాలో 427 పంచాయతీలు, మొత్తం 3704 వార్డులు ఉన్నాయి. అధికారులు 3,704 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తం ఓటర్లు 2,86,430 కాగా, వీరిలో పురుషులు 1,42,585 మంది, మహిళలు 1,43,845 మంది ఉన్నారు. ● సూర్యాపేట జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు, మొత్తం 4,388 వార్డులు ఉన్నాయి. అధికారులు 4,403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో గ్రామీణ ఓటర్లు 6,94,815మంది ఉన్నారు. అందులో 3,40,743మంది పురుషులు, 3,54,050మంది మహిళలు, 22 మంది ఇతరులు ఉన్నారు.

నేటి నుంచి మళ్లీ పత్తి కొనుగోళ్లు

- బంద్‌ను విరమించిన జిన్నింగ్ మిల్లులు
- ఊపిరి పీల్చుకున్న పత్తి రైతులు

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లుల బంద్‌ను యాజమాన్యాలు విరమించాయి. సీసీఐ నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిన్నింగ్ మిల్లులు మంగళవారం బంద్ పాటించాయి. దీంతో రంగంలోకి దిగిన సీసీఐ సీఎండీ జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మిల్లులను రెండు మూడు రోజుల్లో తెరుస్తామని ఆయన హామీ ఇవ్వడంతో జిన్నింగ్ మిల్లుల యజమానులు బంద్‌ను ఉపసంహరించుకున్నారు. 7

వరి కొయ్యలు కాల్చొద్దు

- భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం 7
- అవగాహన లేక కొయ్యలు తగలబెడుతున్నరైతులు

పంతంగిలో ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు 7

భార్య పుట్టింటికి వెళ్లిందని బలవన్మరణం 6

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కలెక్టర్ ఎం.హనుమంతరావు



మత్తు పదార్థాల నిరోధానికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు, పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, డ్రగ్స్‌రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. మత్తు పదార్థాల నిరోధక కార్యక్రమం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వీరారెడ్డి,భాస్కర్‌రావులతో కలిసి అధికారులు, ఉద్యోగులు సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా జీవన శైలిని మార్చుకోవాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల కొనుగోలు విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసి డ్రగ్స్‌రహిత జిల్లాకోసం కృషి చేయాలన్నారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి కొండాపురం నర్సింహారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మనోహర్, ఆహార తనిఖీ అధికారి స్వాతి,పలు శాఖలజిల్లా అధికారులు,కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

యాదగిరిగుట్ట రూరల్: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. హాజరు పట్టికను పరిశీలిస్తూ వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? సమయపాలన పాటిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరై రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి: కలెక్టర్

రాజాపేట,నవంబరు18(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ కోరారు.మంగళవారం రాజాపేట మండలం కాల్వపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు బిల్లులు సరిగ్గా చెల్లిస్తున్నారా...ఇసుకను ఉచితంగా అందిస్తున్నారా..మెటీరియల్ తక్కువ ధరకు అందుతుందా అని లబ్ధిదారులను ఆరాతీశారు..అనంతరం వారు మాట్లాడుతూ నిర్మాణాలకు మెటీరియల్‌ను తక్కువ ధరకు అందించేందుకు మండలాలలో కమిటీలు వేశామని తెలిపారు. వివిధ దశలలో ఉన్న ఇళ్లను పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలని సూచించారు.

బాధ్యతతో వైద్య సేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి మనోహర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మనోహర్

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) బాధ్యతతో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి మనోహర్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ జిల్లా పరిధిలో పనిచేస్తున్న వైద్యాధికారులు, మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లతోపాటు ఇతర ఆరోగ్య సిబ్బందికి తాము అందిస్తున్న వైద్యసేవలపై ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పనితనం భేషుగ్గా ఉందని, నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందజేయడం అభినందనీయమన్నారు.

డాక్టర్ యశోద మాట్లాడుతూ గర్భిణుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలన్నారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ న్యుమోనియా రాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సుమన్ కళ్యాణ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరమ్మా’.. ఇదేమిటమ్మా!

- ఇందిరమ్మ ఇళ్లకు నోచని పాడిచేడు
- అధికార పార్టీలోని వర్గ విభేదాలే కారణమంటున్న ప్రజలు
- ఆధిపత్య పోరులో నలుగుతున్న పేదల బతుకులు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్న తీరులా ఉందిన పాడిచేడు పరిస్థితి. రాష్ట్రమంతటా ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినా మోత్కూరు మండలం పాడిచేడు గ్రామానికి నేటికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాలేదు. అధికార పార్టీలోని రెండువర్గాల మధ్య ఉన్న ఆధిపత్య పోరు కారణంగానే అక్కడ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



పాడిచేడులో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న గుడిసెలో ఉంటున్న సుమలత

మోత్కూరు మండలంలో పాటిమట్ల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని మార్చిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఆ తర్వాత మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి పాడిచేడు గ్రామాన్ని మినహాయించి మండలానికి 147 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేశారు. పాడిచేడు గ్రామానికి 20 ఇళ్లు కేటాయించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మేలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితా ప్రకటించారు. అప్పటినుంచి లబ్ధిదారులు వారి అనుకూలతను బట్టి ముగ్గులు పోసుకుని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. మండలానికి 147 ఇళ్లు మంజూరుకాగా వివిధ కారణాలతో 23మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. మిగతా 124 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం వివిధ స్టేజీల్లో ఉంది. మోత్కూరు మునిసిపాలిటీలో 2 ఇళ్ల నిర్మాణం పూర్తయి గృహప్రవేశం కూడా జరిగింది.

పాడిచేడులో పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక

పాడిచేడు గ్రామానికి 20 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. నేటికీ అక్కడ లబ్ధిదారుల ఎంపిక పూర్తికాలేదు. ఆ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, మరో నాయకుడు పేలపూడి సత్యనారాయణ వర్గాల మధ్య ఆధిపత్య పోరు సాగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారిద్దరు వేర్వేరు పార్టీల్లో ఉన్నా, ఒకే పార్టీలో ఉన్నా వారి మధ్య విబేధాలు కొనసాగుతూనే ఉన్నాయంటున్నారు. గతంలో గ్రామంలో దసరా వేడుకలు కూడా వేర్వేరుగా నిర్వహించేవారు. రెండు మూడేళ్లుగా ఇరువర్గాలు కలిసి వేడుకలు జరుపుకుంటున్నా, ఇప్పుడు ఇద్దరూ అధికార పార్టీలోనే ఉన్నా వారిలోని అంతర్గత విబేధాలు మాత్రం సమసిపోలేదంటున్నారు. వంగాల సత్యనారాయణ మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి ఉన్నంత కాలం ఆయన వర్గంగా ఉండగా, ఇప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గంగా ఉంటున్నట్టు చెప్పుకుంటున్నారు. పేలపూడి సత్యనారాయణ ఎమ్మెల్యే సామేలు వర్గంగా ఉంటున్నాడంటున్నారు. ఇరువర్గాల వారు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం..

- మిగతా 8వ పేజీలో...

గురుకుల పాఠశాలల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయాల్లో ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశించారు. చౌటుప్పల్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చౌటుప్పల్ పట్టణంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, బాలికల గురుకుల పాఠశాల కమ్ జూనియర్ కళాశాల, మండల పరిధిలోని తూప్రాన్‌పేటలోగల బాలికల గురుకుల పాఠశాలల్లో 100 కేవీ సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఆయా పాఠశాలలకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడి నీటికోసం గీజర్లు ఏర్పాటు చేయిస్తానని, చలికాలంలో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయడం చాలా కష్టంగా ఉంటుందన్నారు. వీటితోపాటు ఇన్వర్టర్, డైనింగ్‌హాల్, టాయిలెట్స్ నిర్మాణానికి సహకారం అందిస్తానన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్ అవసరాలకనుగుణంగా భవనాల నిర్మాణాల్లో మార్పులు చేయాలని సూచించారు. సంస్థాన్‌నారాయణపురంలోని కస్తూర్బా పాఠశాలలో నూతన భవనాలు, డైనింగ్ హాల్, వంట గది, టాయిలెట్స్ ప్రహరీ తదితర నిర్మాణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈవో సత్యనారాయణ, ఎంఈవో గురువారావు, డీఈ శివకుమార్, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జి రాజు గౌడ్, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్నఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నేటి నుంచి జిల్లాలో బస్సుయాత్ర

భువనగిరి గంజ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జిల్లాలో సీపీఐ బస్సు యాత్ర కొనసాగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో సీపీఐ ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొని రాష్ట్రం సాధించేవరకూ పోరాటం చేసిందని, భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తికోసం పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. దేశంలో కార్మికులు, విద్యార్థులు, రైతులు, మహిళల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేస్తుందన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయడానికి నేటి నుంచి 22వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని మండలాల్లో సీపీఐ రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ప్రచారం చేయనుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి

సుంకిశాల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

వలిగొండ, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సుంకిశాల గ్రామంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం పరిసమాప్తం అయ్యాయి. స్వామివారి కల్యాణం అనంతరం రథోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ గోవింద నామస్మరణతో శ్రీహరిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు సంతోష్‌కుమారాచార్యులు, వేంకటేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



సుంకిశాలలో స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

21న ఆలేరులో ఉర్సు ప్రారంభం

ఆలేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణంలోని రామసముద్రం మార్గంలో ఉన్న హస్తానా అజ్రత్ సయ్యద్ అహ్మద్ బదియొద్దీన్ పీర్ కుత్‌బుల్ జిందాస మదార్ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 21, 22 తేదీలలో నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు బిజని మధు మంగళవారం విలేకరులకు తెలిపారు. 21న మధ్యాహ్నం పట్టణంలోని కాటమయ్య నగర్‌లో ఉన్నతమ స్వగృహం నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమవుతుందని, సాయంత్రం దంబాల్ కార్యక్రమం ఉంటుందన్నారు. 22న సాయంత్రం దర్గ వద్ద చిరాగ్ జికల్ (దీపారాధన) కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలేరు పరిసర ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

దేవస్థానంలో సమస్యలు పరిష్కరించాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోద శ్రీరాములు



గుట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థానంలో పేరుకుపోయిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోద శ్రీరాములు అన్నారు. మంగళవారం యాదగిరికొండపై పర్యటించి సమస్యలను గుర్తించి మాట్లాడారు. కొండపైన బస్టాండ్ ఆవరణలో దుకాణాల సముదాయాలతో, అధిక ధరలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తగా అర్హులైన స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, పేరబోయిన మహేంద ర్, బబ్బూరి శ్రీధర్, గోరేటి రాములు, పేరబోయిన పెంటయ్య, కలెపల్లి మహేందర్, పేరబోయిన బంగారి, ఆరె పుష్ప, గోపగాని రాజు, పాల్గొన్నారు.

కొండపైన సమస్యలపై సీపీఐ ఆందోళన బాట

(ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్): కొండపైన నెలకొన్న సమస్యలపై సీపీఐ ఆందోళన బాట చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు తెలిపారు. మంగళవారం సీపీ ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండపైన ఆయా శాఖల్లో నెలకొన్న సమస్యలు, తదితర అంశాలను సీపీఐ పట్టణ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్ ఆధ్వర్యంలో పరిశీలించినట్లు చెప్పారు. కొండపై అవినీతి పెరిగిపోయిందని, ఈఈ రామారావు అవినీతికి పాల్పడి ఏసీబీకి చిక్కిన ఆయన ఆస్తులను బహిర్గతం చేయాలన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బద్దం యాదిరెడ్డి

మోత్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం మోత్కూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు బద్దం యాదిరెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం మోత్కూరు కార్యాలయంలో జరిగిన రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాల బకాయిలు, పెన్షనర్లకు చెల్లించాల్సిన ఐదు డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్‌సీని అమలు చేయాలని, నగదు రహిత చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకవరం వల్లభాయ్, గూడ రాజబోస్, టి.మనోహరాచారి, ఎస్.యాదగిరిలక్ష్మీ, వి.యాదగిరి, బి.వెంకటేశ్వర్లు, ఎండి.అజీమొద్దీన్, అవిశెట్టి అవిలిమల్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షమెన్నడో!

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

అద్దెభవనాలు, అరకొర సౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో 61 అంగన్‌వాడీ కేంద్రాలుండగా తుర్కపల్లి సెక్టార్‌లో 32 కేంద్రాలకుగాను కేవలం 8 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. 8 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో 16 కేంద్రాలు కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహిస్తున్నారు. మాదాపూర్ సెక్టార్‌లో 29 కేంద్రాలకు 4 చోట్ల మాత్రమే సొంత భవనాలు ఉండగా ఆరు కేంద్రాలు అద్దె భవనాల్లో, 19 కేంద్రాలు సామాజిక భవనాలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. రెండు సెక్టార్లలో కలిపి నాలుగేళ్ల లోపు పిల్లలు 827 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. కొన్నిచోట్ల పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలి



కొన్నేళ్లుగా అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రంలో కనీస మౌలిక వసతు లు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నాం. అన్ని మౌలిక వసతులతో నూతన భవనం నిర్మించాలి.

- నూనావతు కవిత, జేతురాంతండా, తుర్కపల్లి

నూతన భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మాణానికి గ్రా మం నుంచి స్థలం ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు గ్రామంలో ప్రభు త్వ స్థలం ఉన్న చోట అంగన్‌వాడీ కేంద్ర భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కొన్ని కేంద్రాలకు ప్రభు త్వం నుంచి నిధులు మంజూరు చేయగా, పనులు ప్రారంభించారు.

- రేకల స్వరాజ్యం, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్, ఆలేరు

తగ్గుతున్న ఆదరణ

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తగ్గుతున్న చిన్నారుల సంఖ్య
- శిథిలావస్థలో కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి-డిండి)

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆదరణ కరువైంది. దీంతో క్రమంగా కేంద్రాల్లో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. అద్దె, శిథిలావస్థకు చేరిన భవనాల్లో కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఉన్న భవనాల్లో మౌలిక వసతులు కానరావడంలేదు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని కందుకూరు, ఎర్రారం, డిండి సెక్టార్ల పరిధిలో 73 అంగన్‌వాడీ కేంద్రాలు సేవలను అందిస్తున్నాయి. అందులో 32 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 14 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. 27 కమ్యూనిటీ హాల్స్, పాఠశాల్లో నిర్వహిస్తున్నారు. సింగరాజుపల్లిలో భవనం అసంపూర్తిగా ఉంది. డిండి మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో 2013లో నిర్మించిన భవనానికి తలుపులు, కిటికీలు బిగించలేదు. కాంట్రాక్టర్‌కు రూ.1.5లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులను నిలిపివేశాడు. డిండి అంగన్‌వాడీ కేంద్రం1 శిథిలావస్థకు చేరింది. పిల్లలమీద పెచ్చులూడి ఎప్పుడు పడుతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం-3కు పక్కా భవనం నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.12లక్షలు మంజూరయ్యాయి. నేటికి పనులు ప్రారంభించలేదు.



శిథిలావస్థలో ఉన్న డిండి అంగన్‌వాడీ సెంటర్

తక్కువ సంఖ్యలో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. డిండిలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో కేవలం 5 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. ఇదే తరహాలో మండలంలోని అనేక అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉంది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు చెప్పిన వివరాల ప్రకారం 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 741 మంది, 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల పిల్లలు 302 మంది ఉన్నారు. మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పూర్వ ప్రాథమిక విద్యను అందించాల్సి ఉంది ఐదేళ్లు పూర్తికాగానే సమీపంలోని పాఠశాలలో చేర్పించాల్సి ఉంటుంది. కాని మూడేళ్ల వయసులోనే చిన్నారులను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య తగ్గుతున్నట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

వేతనం తక్కువ, పనిభారం ఎక్కువ

అంగన్‌వాడీ టీచర్లకు రూ.13600 నెలసరి గౌరవ వేతనాన్ని అందజేస్తున్నారు. వీరిని బీఎల్‌వోల పని మొదలుకొని ప్రభుత్వం నిర్వహించే ప్రతి సర్వేలోనూ భాగస్వాములను చేస్తున్నారు. ఐసీడీఎస్ పరిధిలో నిర్వహించే అవగాహన సదస్సులు కూడా వీరు నిర్వహిస్తుంటారు. పనిభారం పెరిగినా ఉపాధ్యాయులకు వేతనాలు పెరగడం లేదు.

మూడేళ్ల చిన్నారులను ప్రైవేట్‌లో చేర్పిస్తున్నారు



మూడేళ్ల చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో బదులుగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 5 ఏళ్లు పూర్తయిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్నా తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లోననే చేర్పిస్తున్నారు.

- చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్

గీత కార్మికుడికి గాయాలు

మోత్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బీసు సదయ్య మంగళవారం తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి మోత్కూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

వేములపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్‌ఐ డీ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల సైదయ్య, శీలం నరేష్ తమ ట్రాక్టర్ల ద్వారా గ్రామశివారులోని పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సల్కునూరు క్రాస్‌రోడ్డు సమీపంలో మైనింగ్ అధికారులు పట్టుకున్నారన్నారు. ఆయా ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు తమకు అప్పగించగా ఉత్తెర్ల సైదయ్య, శీలం నరేష్‌లతో పాటు వారి ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని బలవన్మరణం

యాదాద్రిభువనగిరి జిల్లాలో మద్యానికి బానిసైన ఇరువురు ఒకే రోజు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్నేహితులు చేయి చేసుకున్నారని నల్లగొండ జిల్లా దేవరకొండలో ఓ వ్యక్తి బలవన్మరణం చెందారు.



సంతోష్(ఫైల్)

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుమారుడితో కలిసి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానిక బహార్‌పేటకు చెందిన బానుక సంతోష్(31) ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడి వైఖరితో విసిగిపోయిన భార్య కుమారుడిని తీసుకుని కొంతకాలం కిందట పుట్టింటికి వెళ్లింది. దీనిని అవమానంగా భావించిన సంతోష్ మునిసిపల్ కార్యాలయం సమీపంలోని బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫ్లైఓవర్ నుంచి దూకే ప్రయత్నాలను కింది నుంచి గమనించిన పలువురు నిలువరించే లోపే రోడ్డుపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చౌటుప్పల్‌లోనూ...

చౌటుప్పల్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి అలవాటు అయినా భర్త వేధింపులు భరించలేక భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన భర్త ఉరివేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రం బంగారిగడ్డకు చెందిన సయ్యద్ రఫీ(27)కి అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇనాంగూడ గ్రామానికి చెందిన యువతితో ఐదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు సంతానం కాగా రఫీ స్థానికంగా వెల్డింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ మద్యం తాగి వస్తుండటంతో భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య 20 రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. వారం క్రితం రఫీ భార్యను తీసుకరావడానికి ఇనాంగూడకు వెళ్లాడు. అక్కడ భార్య, మామ, బావమరుదలు తాగి తమ కుమార్తెను ఇబ్బందులు పెడుతున్నావని రఫీని దూషించారు. భార్య రాకపోవడం, అత్తగారి కుటుంబసభ్యులు దూషించడంతో మనస్థాపానికి గురైన రఫీ సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఉదయం గమనించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తండ్రి షార్పోద్దిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

స్నేహితులు చేయి చేసుకున్నారని...

దేవరకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో స్నేహితులు చేసుచేసుకున్నారని మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా కారంపొడి మండలం ఉప్పునూతల గ్రామానికి చెందిన కామిశెట్టి యేసుబాబు(23) ఏడాదిగా మండలంలోని పెంచికల్‌పహడ్‌లో ఇటిక బట్టిలో కూలీగా పనిచేస్తు కుటుంబంతో జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా యేసుబాబు సోమవారం రాత్రి దేవరకొండ పట్టణానికి వచ్చి పెంచికల్‌పహడ్‌కు వెళ్తుండగా పట్టణానికి చెందిన ముగ్గురు యువకులతో గొడవపడ్డాడు. యేసుబాబు ద్విచక్రవాహనం అదుపుతప్పి గణేష్ అనే యువకునికి తగిలింది. దీంతో గణేష్, అతని మిత్రులు రాములు, నవీన్‌లు యేసుబాబును దూషించి చెయ్యి చేసుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన యేసుబాబు మంగళవారం ఉదయం భార్య ఇటుక బట్టిలో పనికి వెళ్లగా ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తోటి కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యేసుబాబు భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసోంలో పిట్టెలగూడెం వాసి మృతి



మల్లయ్య (ఫైల్‌ఫొటో)

గుర్రంపోడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసోం రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం వాసి మృతి చెందాడు. పిట్టెలగూడెం గ్రామానికి చెందిన లారీడ్రైవర్ పసిమేకల మల్లయ్య(50) మంగళవారం అసోంలో ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ ఒకరి ...

కట్టంగూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామానికిచెందిన పాలడుగు అంజయ్య సెంట్రింగ్ పనిచేస్తూ పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తన భార్య రేణుకతో కలిసి సోమవారం రాత్రి నార్కట్‌పల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలోని అయిటిపాముల వద్ద శ్రీకృష్ణనగర్ వద్ద హైవేపై హైదరాబాద్ నుంచి వస్తున్న కారు బైరపేలి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజయ్యను మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

గర్భవిచ్ఛిత్తికి యత్నం

ఆసుపత్రి నిర్వాహకురాలిపై పోలీసులకు ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు

చిట్యాల/చిట్యాల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ విద్యార్థినికి గర్భవిచ్ఛిత్తికి యత్నించిన ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకురాలిపై నల్లగొండ జిల్లా ఐసీడీఎస్ అధికారులు చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూపర్‌వైజర్ సునీత మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్యాల మండలంలోని ఓ గ్రామానికి బాలిక ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఆమె గర్భం దాల్చిందన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బాలికను నిలదీయటంతో పక్క మండలానికి చెందిన తన క్లాస్‌మేట్ ఇందుకు కారణమని తెలిపింది. దీంతో తల్లిదండ్రులు ఆమెకు గర్భవిచ్ఛిత్తి చేయించేందుకు ఈ నెల 17వ తేదీన చిట్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన గుర్తుతెలియని వ్యక్తి డయల్-100కు కాల్ చేసి పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి చేరుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలికను సఖీ కేంద్రానికి తీసుకెళ్లి విచారించారు. కౌన్సిలింగ్ అనంతరం నల్లగొండలోని భరోసా కేంద్రానికి తరలించారు. అబార్షన్‌కు యత్నించిన ఆసుపత్రి నిర్వాహకురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదుపై వివరణకు ప్రయత్నించగా పోలీసులు స్పందించలేదు.

భార్యను హత్యచేసిన భర్త రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

మోతె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మోతె మండలంలో అనుమానంతో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కారింగుల పద్మను భర్త కారింగుల వెంకన్న ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో రోకలిబండతో కొట్టి హత్య చేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. విచారణ అనంతరం వెంకన్నను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

గుండాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని మర్రిపడగ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో 40క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. గ్రామానికి చెందిన బోయిని అంజయ్య నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేయగా దిగుబడిగా వచ్చిన పత్తిని ఇంట్లో నిల్వ చేశాడు. రోజు వారీగా వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా మధ్నాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు వస్తుండటంతో స్థానికులు గుర్తించి అంజయ్యకు తెలిపారు. ఇంటికి చేరుకునే సరికి పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న వస్తువులు కూడా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.3లక్షలు నష్టపోయానని ప్రభుత్వం ఆర్థికసాయం అందచేసి ఆదుకోవాలని రైతు అంజయ్య కోరారు.



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన పత్తి

గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

హాలియా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సరఫరా చేస్తున్న యువకుల ముఠాను నల్లగొండ జిల్లా హాలియ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రాజశేఖరరాజు హాలియా పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. హాలియా పరిసర ప్రాంతాల్లోని కొంతమంది యువకులు గంజాయికి అలవాటుపడి పల్నాడు జిల్లా మాచర్లకు వెళ్లి అక్కడి సరఫరాదారుల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారు. మాచర్లకు చెందిన చల్లా చినఆంజనేయులు అలియాస్ బండా అంజి, చల్లా పెద్దఆంజనేయులు అలియాస్ మ్యాక్స్ గుంటూరు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి హాలియా ప్రాంత యువతకు విక్రయిస్తున్నారు. హాలియాకు చెందిన ద్విచక్రవాహన మెకానిక్ మహ్మద్ రియాజ్‌బాబ, సెల్‌ఫోన్ టెక్నీషియన్ సల్లా అజయ్, హజారీగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి షేక్ ఇషాన్ హుస్సేన్, మాచర్లకు చెందిన మేస్త్రీ చల్లా చినఆంజనేయులను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు మాచర్లకు చెందిన చల్లా పెద్ద అంజనేయులు అలియాస్ మ్యాక్స్ అలీనగర్ చెక్‌పోస్ట్‌కు చెందిన పంపు ఆపరేటర్ అమరవరపు జేమ్స్, హాలియా రెడ్డికాలనీకి చెందిన డీజే ఆపరేటర్ కేశమళ్ల అంజి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.30 వేల విలువైన 1200 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం నిందితులను కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ సాయిప్రశాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు, పక్కన సీఐ సతీష్‌రెడ్డి

మహిళా పొదుపు సంఘాలకు కుచ్చుటోపీ

నల్లగొండ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో పొదుపు సంఘాలకు సంబంధం లేకుండానే రూ.కోటిన్నరకు పైగా నిధులు స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. 10 రోజుల క్రితమే నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఎదుట వివిధ మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. తమకు ఎలాంటి సంబంధం లేకున్నా తమ ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్లను తీసుకొని మోసం చేశారని మహిళలు ఆందోళన చేపట్టారు. అయితే అప్పట్లో ఆ బ్యాంకుతో పాటు ఇతర బ్యాంకర్లు కూడా నచ్చజెప్పినట్లు తెలిసింది. అయితే తీసుకున్న రుణాలను చెల్లించాలంటూ ఇటీవల వారికి మళ్లీ నోటీసులు వెళ్లడంతో ఆందోళనకు గురైన మహిళా సంఘాల సభ్యులు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. అనంతరం అధికారులకు తమకు జరిగిన నష్టాన్ని వివరించి న్యాయం చేయాలని కోరారు. కేశరాజుపల్లి గ్రామానికి చెందని 12 పొదుపు మహిళా సంఘాలకు సంబంధించిన సంఘ సభ్యుల నుంచి కొద్దిరోజుల కిందట రూ.10వేల చొప్పున అక్రమంగా వసూలు చేసినట్లు తెలిసింది. దీనికి తోడు అదే సంఘానికి చెందిన సభ్యులపైన వారికి తెలియకుండానే రూ.1కోటి50లక్షలను వారి పేరు మీద రుణాలు తీసుకొని స్వాహా చేశారు. ఆయా బ్యాంకు ఉద్యోగులతో కలిసి ఈ నిధులు స్వాహా చేశారా లేదంటే బుక్ కీపర్ నిధులు కాజేసిందా అనేది విచారణలో తెలియాల్సి ఉంది. బ్యాంకు ఫీల్‌ఆఫీసర్లపైన కూడా ఆయా సంఘాల సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాము తీసుకోని రుణాలకు నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు ఉద్యోగులు నాలుగు నెలలుగా ఆయా సంఘాల సభ్యులు తీసుకున్న డబ్బులు చెల్లించడంలేదని నోటీసులు ఇవ్వడంతో సదరు మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ ఆధార్ కార్డులను, బ్యాంక్ అకౌంట్లను జిరాక్స్‌లను తీసుకెళ్లి అక్రమంగా డబ్బులు కాజేశారని సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఏ మేరకు విచారణ చేసి వారికి న్యాయం చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

అసౌకర్యాల మధ్య గురుకులం

మిర్యాలగూడ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురంలోని బాలుర గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. గురుకులంలో 504 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ఉత్తమ విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే గురుకులాల్లో చేరితే ఇక్కడి అవస్థలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

ఇరుకు గదులతో ఇక్కట్లు

గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలగా ఏర్పాటుచేసిన తదుపరి విద్యార్థులను వేరుగా విభజించారు. పాఠశాల, కళాశాల నిర్వహణను వేర్వేరుగా ఏర్పాటు చేసినప్పటికీ పాఠశాల విద్యార్థులకు అనుకూలంగా వసతిగృహాలు లేకపోవడంతో ఇరుకు గదుల్లోనే సర్దుకుంటున్నారు. చలికాలం రావడంతో సరిపడా దుప్పట్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

మరుగుదొడ్లు కనుమరుగు

పాఠశాల ఏర్పాటుచేసి రెండు దశాబ్దాలు కావొస్తున్నా అధికారులు మాత్రం విద్యార్థుల వసతి సౌకర్యాల ఏర్పాటుపై పర్యవేక్షణ చేపట్టలేదు. ఆనాడు ఏర్పాటుచేసిన స్నానపు గదులు, మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి స్నానపు గదులు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో ఆరుబయటే అన్ని కార్యక్రమాలను సాగిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. విద్యార్థుల అవసరాలను గుర్తించి సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఇరుకు గదుల్లో సర్దుకుంటున్న పాఠశాల విద్యార్థులు

ఉన్నతాధికారులకు తెలియచేశాం

పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు తెలియపరిచాం. విద్యార్థులకు సరిపడా డార్మెటరీ రూమ్‌లు అదనంగా ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు, స్నానపు గదులు రిపేర్ చేయించాలని, అదనంగా టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టాలని కోరాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తాం.

- ముజీబ్ హుస్సేన్, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల అవంతీపురం

రాజేష్‌ను విచారణ పేరుతో వేధించారు

- న్యాయంచేయాలంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



ర్యాలీగా డీఎస్పీ కార్యాలయానికి వస్తున్న రాజేష్ బంధువులు

కోదాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విచారణ పేరుతో పోలీసులు కొట్టడంతోనే రాజేష్ మృతి చెందాడని, అతడి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్(32)ను సీఎంఆర్ఎఫ్ రిలీఫ్‌ఫండ్ అక్రమాల కేసులో చిలుకూరు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 10న అతడిని పోలీసులు హుజుర్‌నగర్ సబ్‌జైలు తరలించారు. రాజేష్ అస్వస్థతకు గురికాగా చికిత్సనిమిత్తం జైలు సిబ్బంది హుజుర్‌నగర్ ఆస్పత్రికి, అక్కడ నుంచి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ రాజేష్ ఆదివారం ఉదయం మృతి చెందారు. సోమవారం రాత్రి రాజేష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి కోదాడకు తీసుకువచ్చి బంధువులకు పోలీసులు అప్పగించారు. ఈ నేపథ్యంలో రాజేష్‌ను పోలీసులు విచారణ పేరుతో దెబ్బలు కొట్టటంతోనే అస్వస్థతకు గురై మృతి చెందారని బంధువులు ఆరోపిస్తూ, రాజేష్ కుటుంబానికి న్యాయం చేయామని మంగళవారం ఉదయం డీఎస్పీ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో సూర్యనారాయణ డీఎస్పీ కార్యాలయానికి రావడంతో అతడికి వినతిపత్రం అందజేశారు.

ఆర్డీవో హామీతో ఆందోళన విరమణ

రాజేష్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి అన్నివిధాలా ఆదుకుంటామని ఆర్డీవో సూర్యనారాయణ హామీ ఇచ్చారు. కోదాడ మాజీ సర్పంచ్ ఏర్నేని బాబు రాజేష్ కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. రాజేష్ విషయాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని రాజేష్ కుటుంబంలో ఒకరికి మునిసిపల్‌లో ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో రాజేష్ బంధువులు ఆందోళన విరమించారు. డీఎస్పీ కార్యాలయం ఎదుట ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా రాజేష్ మృతికి పోలీసులను బాధ్యులను చేస్తూ హైకోర్టులో మంగళవారం లంచ్‌మోషన్‌లో రిట్‌పిటిషన్ వేసినట్లు సమాచారం.

ముగిసిన కోట మైసమ్మ బ్రహ్మోత్సవాలు

● వైభవంగా బోనాలు, కార్తీక దీపోత్సవం



కోటమైసమ్మ అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు

నిడమనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామ సమీపంలో కొలువై ప్రసిద్ధి చెందిన శ్రీ కోట మైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ప్రతీ సంవత్సరం పవిత్ర కార్తీకమాసంలో ఆలయంలో మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజున సుప్రభాత సేవ, శతఘటాభిషేకం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మంగళవాయిద్యాలతో ఆగమశాస్త్ర ప్రకారం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉదయం ఘనంగా బోనాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. చివరిరోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొందరు భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చౌటి అంజనేయులు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ సిబ్బంది విఠలేశ్వర్, రాజు, రమణయ్య, నర్సిరెడ్డి, నార్ల శ్రీనివాస్, పద్మ, కోటయ్య, పుష్ప, స్వాతి, వెంకన్న పాల్గొన్నారు.

మునుగోడు పీఏసీఎస్‌కు విశిష్ట గుర్తింపు

● ఐఎస్‌వో సర్టిఫికెట్ అందజేత



డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మునుగోడు ప్రాథమిక సహకార సంఘానికి విశిష్టమైన గుర్తింపు లభించింది. ఈ పీఏసీఎస్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్‌వో 9001: 2015 నాణ్యత నిర్వహణ సర్టిఫికేషన్ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ నుంచి సాధించింది. ఈ సర్టిఫికెట్‌ను మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఐఎస్‌వో ప్రమాణాల ప్రకారం అన్ని పారామీటర్లను పరిశీలించేందుకు హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ సర్టిఫికేషన్స్ బృందం మునుగోడు పీఏసీఎస్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను బృందం ప్రశంసించింది. పీఏసీఎస్ భవనం ఆధునికంగా నిర్మించడంతో పాటు యూరియాతో పాటు ఇతర వ్యవసాయ అవసరాలను సమర్థవంతంగా సరఫరా చేయడం, రుణాల మంజూరు, వసూళ్లలో పారదర్శకత పాటించారు. అదేవిధంగా వరి ధాన్యం సేకరణ, కొనుగోళ్లలో సమర్థత, పీఏసీఎస్ ఆదాయం పెంచడం, సిబ్బంది నిబద్ధతో పనిచేయడం వంటివి గుర్తించి ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. అదేవిధంగా రైతుల ప్రయోజనం కోసం ప్రత్యేక వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేసి వినియోగిస్తున్న ఏకైక సంఘంగా మునుగోడు పీఏసీఎస్ నిలిచిందని బృందం పేర్కొంది. అన్ని అంతర్గత ప్రక్రియలు ఐఎస్‌వో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నందున సర్టిఫికెట్ మంజూరు చేయాలని సిఫారసు చేసింది. ఐఎస్‌వో సర్టిఫికేషన్ పొందిన తొలి సంఘంగా మునుగోడు పీఏసీఎస్ నిలిచింది. ఈ సందర్భంగా మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆ సొసైటీ డైరెక్టర్లను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభినందించారు.

మహబూబ్‌పేటలో ఛత్తీస్‌ఘడ్ బృందం



మహబూబ్‌పేటలో నర్సరీని పరిశీలిస్తున్న ఛత్తీస్‌ఘడ్ బృందం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో మంగళవారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఉపాధిహామీ అధికారుల బృందం పర్యటించింది. జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో చేపడుతున్న పంచాయతీ భవన నిర్మాణం, నర్సరీ, డ్రాగన్‌ఫ్రూట్ తోట పెంపకం, మామిడి మొక్కలు, పెంపకం, కోళ ఫారంలను బృందం పరిశీలించింది. వాటి నిర్వహణ తీరు, పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో సురేష్, పలువురు అధికారులు అనురాధ, జయశ్రీ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

● బంద్‌ను విరమించిన జిన్నింగ్ మిల్లులు

● ఊపిరి పీల్చుకున్న పత్తి రైతులు

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జిన్నింగ్ మిల్లుల బంద్‌ను యాజమాన్యాలు విరమించాయి. సీసీఐ నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిన్నింగ్ మిల్లులు మంగళవారం బంద్ పాటించాయి. జిల్లాలోని అన్ని మిల్లులు తెరవాలని, రోజుకో నిబంధనతో సమస్యలు సృష్టించకుండా చూడాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తూ నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారు. అయితే సీసీఐ సీఎండీ జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మిల్లులను రెండు మూడు రోజుల్లో తెరుస్తామని ఆయన హామీ ఇవ్వడంతో జిన్నింగ్ మిల్లుల యజమానులు బంద్‌ను ఉపసంహరించుకున్నారు.

ఇప్పటి వరకు 98,480 క్వింటాళ్లు కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 23 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటి వరకు 23 మిల్లులను తెరిచారు. సోమవారం నాటికి 98,480 క్వింటాళ్లకు పైగా పత్తిని ఈ మిల్లులు కొనుగోలు చేశాయి. కాగా, సీసీఐ ప్రతీరోజు ఏదో ఒక నిబంధనను తీసుకవస్తుడటంతో రైతులతో పాటు జిన్నింగ్ మిల్లుల యజమానులు సతమతమవుతున్నారు. ఎకరానికి కేవలం 7క్వింటాళ్లే కొనుగోలు చేయడం, తేమశాతం 8 నుంచి 12శాతం లోపు ఉండాలనే నిబంధనలతో పాటు ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో నిబంధనలను అమలులోకి తీసుకురావచ్చింది. దీంతో కొన్ని మిల్లులే తెరుచుకోగా, మిగిలిన మిల్లుల్లో కొనుగోళ్లకు అవకాశం లేకుండా పోయింది. దీంతో అటు మిల్లర్లు, ఇటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 24న పత్తి కొనుగోళ్ల ప్రారంభం కాగా, ఈ నెల 18వ తేదీ వరకు సీసీఐ పలు విధాలుగా కొర్రీలు పెడుతూనే ఉందని, పత్తిని కొనుగోలు చేసే నాథుడే లేడని రైతులు వాపోతున్నారు. సీసీఐ మద్దతు ధర ఇవ్వకపోవడంతో పాటు కొనుగోళ్లు అరకొరగా చేయడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో దళారులకు పత్తిని విక్రయించే పరిస్థితి ఏర్పడింది. సీసీఐనే పరోక్షంగా దళారులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త నిబంధనలు తెస్తోందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఎకరాకు 10క్వింటాళ్ల చొప్పున మొత్తంగా 57లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే అధిక వర్షాలు, తుపాన్ కారణంతో పత్తి రైతులు నిండా మునిగారు. జిల్లాలో 35వేల ఎకరాల్లో పత్తి రైతులు అధిక వర్షాలతో పాటు తుపాన్ ప్రభావంతో నష్టపోయారు. దీంతో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు కూడా పత్తి రాని పరిస్థితి ఏర్పడింది. తేమ లేని పత్తికి మాత్రమే క్వింటాకు రూ.8,110 చెల్లిస్తామని సీసీఐ పేర్కొంది. అయితే తేమ పేరుతో సీసీఐ సరైన ధర చెల్లించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. సీసీఐ సీఎండీ చెప్పిన విధంగా మూడు రోజుల్లో అన్ని జిన్నింగ్ మిల్లులను తెరుచుకోకపోతే జిన్నింగ్ మిల్లుల యజమానులు తిరిగి సమ్మెకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చూడాల్సి ఉంది.



చిట్యాల మండలం పెద్దకాపర్తిలో మిల్లు గేటుకు ఏర్పాటు చేసిన నిరవధిక బంద్ ఫ్లెక్సీ

రెండు రోజులుగా ఇబ్బందులు

● సమ్మెతో పత్తి రైతుల దిగులు

నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, శాలిగౌరారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పత్తిని పండించిన రైతులకు విక్రయించాలంటే తిప్పలు తప్పడం లేదు. కాటన్ మిల్లుల యజమానుల సమ్మెతో రైతులు రోజుల తరబడి అమ్ముకోవడానికి దిగాలు పడుతున్నారు. జిన్నింగ్ మిల్లుల సమ్మె వల్ల, నిరవధిక బంద్‌తో రెండు రోజులుగా జిల్లా లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు చే పట్టలేదు. తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు జిన్నింగ్ మిలులు నిరవధిక బంద్ పాటించడంతో 17,18వ తేదీల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టలేదు. సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 పేరిట పలు మిల్లులు నడిపిస్తూ మరికొన్ని మిల్లులను నడిపించనందున అన్ని మిల్లులను నడిపించాలని ప్రభుత్వానికి, సీసీఐకి పలుమార్లు విన్నవించినా కూడా ఏమాత్రం స్పందన లేదని, దాని వల్ల సోమవారం నుండి పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. పత్తిని తీసుకువచ్చిన రైతులకు ముందు నుంచే కొనుగోలు చేయడంలేదని యాజమాన్యం తెలిపింది. నిరవధిక బంద్ అంటూ మిల్లు యాజమాన్యాలు గేటుకు ఫ్లెక్సీలు ఏ ర్పాటు చేసి మూసివేశారు.

● నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలోని పత్తిని విక్రయించేందుకు తీసుకువచ్చిన 1 డీసీఎం, 1 ఆటో మిల్లు వద్ద నిలిపివేచి ఉన్నాయి. శాలిగౌరారం మండలం మాదారంలోని టీఆర్‌ఆర్ కాటన్ మిల్లులో సీసీఐ వారు నాలుగు రోజుల నుంచి కొనుగోళ్లు నిలిపివేశారు. మంగళవారం టీఆర్‌ఆర్ కాటన్ మిల్లు వద్ద దాదాపు 20కి పైగా ట్రాక్టర్లు పత్తి లోడుతో బారులు తీసి ఉన్నాయి. మిల్లు గేటు వేసి ఉండటం వల్ల రైతులు నిరీక్షిస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లిలో గల వరలక్ష్మీ కాటన్ మిల్లు వద్ద రెండు ట్రాక్టర్లలో రైతులు పత్తిని తీసుకువచ్చి మిల్లు మూసి ఉండటంతో వెనక్కి తీసుకెళ్లారు.



శాలిగౌరారం మండలం మాదారం టీఆర్‌ఆర్ కాటన్ మిల్లు వద్ద ఉన్న పత్తి ట్రాక్టర్లు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



యాదగిరిగుట్ట ఆలయంలో వేం నరేందర్‌రెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, ప్రధానాలయం, పాతగుట్ట లక్ష్మీనరసింహులకు నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన, పాతగుట్ట వద్ద విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సిందూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో, శివాలయంలో నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.35,26,329 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడ మండపంలో 603 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలు జరిపించగా అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయంలో బుధవారం వేకువజామున అర్చకులు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించగా ఆలయ ఈవో గిరిప్రదక్షిణ ప్రారంభిస్తారు.

స్వామి వారి సేవలో ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. యాదగిరికొండకు మంగళవారం సాయంత్రం చేరుకున్న ఆయన కుటుంబ సమేతంగా ముందుగా కొండకింద ఆధ్యాత్మిక వాడలో సత్యదేవుని వ్రతంలో పాల్గొన్నారు. అంతకు ముందు ప్రెసిడెన్షియల్ చేరుకున్న ఆయనకు కలెక్టర్ ఎం.హనుమంతరావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్‌నాయక్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

స్వామిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా ధ్వజస్తంభానికి మొక్కి గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకబృందం ఆశీర్వచనం చేయగా అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి లడ్డు ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.

మట్టపల్లిలో వైభవంగా నృసింహుని కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రీస్వామికి మంగళవారం విశేష అర్చనలు జరిగాయి. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవునికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమాలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుని మూర్తులను కల్యాణాన్ని కన్నులపండువగా వేదపండితులు నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహన్నివేదనలు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు అర్చకులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మట్టపల్లిలో కోటి దీపోత్సవం

కార్తీకమాసంలో చివరిరోజు కార్తీక అమావాస్యను పురష్కరించుకొని గురువారం మట్టపల్లి మహక్షేత్రంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, గర్భాలయం ఎదుట దీప ప్రజ్వలన, కృష్ణాహారతి అనంతరం రాజగోపురం కోటి వత్తుల దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



ఎమ్మెల్సీ మల్లన్నకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న మట్టపల్లిరావు

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● అఖిల బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లా వేణుగోపాల్‌రావు

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను విడుదల చేయాలని అఖిల బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు డిమాండ్ చేశారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణభవన్‌లో మంగళవారం గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడిజిల్లా కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఐక్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఉపకార వేతనాలు పెంచడం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, గాయత్రి సేవా సంస్థ వ్యవస్థాపకుడు గర్నపూడి శ్రీరామశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ యువతలో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంచే కార్యక్రమాలు, చిన్న వ్యాపారాల, స్వయం ఉపాధి రుణాలు, పేద పూజారులు, అర్చకులకు ఆర్థికసాయం వృత్తిపరమైన భద్రత కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్‌శర్మ, చకిలం అనిత, రజిని, మణికుంట్ల రాజేశ్వరశర్మ, రుద్రవీణ, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పంతంగిలో ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో సత్యనారాయణ

చౌటుప్పల్ రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం పంతంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-17 బాల బాలికల ఖోఖో పోటీలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. డీఈవో సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన నల్లగొండ, యాదాద్రి టీమ్‌లకు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 12 మంది విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 23, 24, 25తేదీల్లో పంతంగిలో రాష్ట్రస్థాయి ఖోఖో అండర్ 17 పోటీలు జరుగనున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో గురువరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దశరథరెడ్డి, పొన్నకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, దూడల బిక్షంగౌడ్, సప్పిడి లింగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ

ఎన్నికలకు రెఢీ!

(5వ పేజీ తరువాయి)

వార్డులు ఉన్నాయి. వీటిలో 10,73,506 మంది ఓటర్లు నమోదయ్యారు. ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచారు. వార్డుల వారీగా పక్కా ఓటర్ జాబితాలు ఫొటోలతో సహా నమోదు చేశారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా ఓటర్ జాబితాను రూపొందించారు. ఇంటిపక్క ఇళ్లు కూడా ఒకే వార్డులో ఉండేలా చూడడంతో పా టు, వార్డుకు కేటాయించిన ఓటర్లకు మించిన చోట ఒకటి, రెండు ఇళ్లు ఎక్కువ, తక్కువ ఉన్నా ఆ వీధి, లేక వాడ అంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతీ వార్డుకు ఒక పోలిం గ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకైతే ఒకే లోకేషన్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. 1,000 ఓట్లు దాటిన చోట ప్రభుత్వ స్కూళ్లతో పాటు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు అనుకూలంగా ఉంటే రెండో లోకేషన్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు పింక్ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు మెంబర్ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు కూడా సిద్ధం చేశారు.

జిల్లాలో పోలింగ్ స్టేషన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు పోలీస్ బందోబస్తు వినియోగించాలని నిర్ణయించారు. 652 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పోలీస్ అధికారులు గుర్తించగా, 304 సున్నితమైన ప్రాంతాలుగా, మరో 18 అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ అదనపు పోలీస్ బలగాలను నియమించడంతో పాటు, రౌడీషీటర్ల బైండోవర్లు, పాతకేసుల నిందితులను గుర్తించి వివరాలు కూడా సేకరించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడమే తరువాయి పంచాయతీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధంచేశారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

● భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ● అవగాహన లేక కొయ్యలు తగలబెడుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, అడ్డగూడూరు)

వరి సాగు చేస్తున్న రైతులు నారుమడులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఓ పక్క వానాకాలం పంట కోతలు కోస్తుండగా మరో పక్క నారుమడులు సిద్ధం చేస్తున్నారు. వరి కోసిన వెంటనే అవగాహన లేక రైతులు వరి కొయ్యలను తగులబెడుతున్నారు. దీని వల్ల అనేక అనర్థాలు ఎదురువుతాయని శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా భూసారం దెబ్బతినడంతో పాటు పంటల దిగుబడి తగ్గడం, భూమికి దోహదపడే సూక్ష్మజీవులు నశిస్తాయి. ఇదంత తెలియక రైతులు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి కొయ్యల ను తగలబెడుతున్నారు.



చిన్నపడిశాలలో వరి కొయ్యలను కాల్చుతున్న దృశ్యం

కాల్చడం వల్ల కలిగే నష్టాలు

● వరి కొయ్యలు తగలబెట్టిన ప్రాంతంలో భూమి బిగువుగా మారి నీటిని పీల్చుకొనే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంటుంది.

● కాల్చిన చోట భూమిని సేంద్రీయ పదార్థాలన్నింటినీ కోల్పోతుంది.

● వరికొయ్యలను ఏటా కాల్చడం వల్ల భూసారం తగ్గడంతో పాటు వాయు కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉంది.

● పంటలకు తోడ్పడే సూక్ష్మజీవులపై తీవ్ర ప్రభావం పడుతుంది

● తగలబెట్టడం కంటే వరి కొయ్యలను కలియ దున్ని సూపర్‌పాస్పేట్ చల్లితే వారం రోజుల్లో పూర్తిగా మురుగుపోతుంది.

● దీంతో భూసారం పెరుగుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం

వరి కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లో తగలబెట్టొద్దు. కాల్చిన చోట భూమి బిగువును మారి నీటిని పీల్చుకొనే స్వభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాక భూసారం దెబ్బతిని పంటల దిగుబడిపై ప్రభావం పడుతుంది. యాసంగి నారుమడుల కోసం రైతులు సిద్ధమవుతున్నారు. నేలకు అనుగుణమైన రకాలను ఎంచుకుంటే ఎక్కవగా వస్తుంది. ప్రతి ఏటా ఈ విషయంపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- పాండురంగాచారి, ఏవో, అడ్డగూడూరు

పాటించాల్సిన చర్యలు

● పొలం దున్నే పది రోజులు ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు పారించాలి. తర్వాత ఎకరాకు 50కిలోల సూపర్‌పాస్పేట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకభూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరిగి దిగుబడి అవకాశాలు పెరుగుతాయి.

● ప్రతీ సంవత్సరం కోల్పోతున్న భూసారాన్ని వృద్ధి చేసుకునేందుకు పొలాల్లో పశువులు, గొర్రెలు మేకల పేడ వేసుకోవాలి. సాధ్యమైనంత వరకు రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి.

CLASSIFIEDS

డాక్యూమెంట్ పోయినది

★ కన్నెబోయిన వెంకమ్మ భర్త లింగయ్య, నివాసం: ఇ.నెం. 6-9-941, గాంధీనగర్, నల్లగొండ మున్సిపాలిటీ, నల్లగొండ జిల్లా అను నా యొక్క ఒరిజినల్ ప్లాట్ డాక్యూమెంట్ నెం. 2830/1986 గలది గాంధీనగర్ నుండి బస్టాండ్‌కు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో పోయినది. దొరికిన వారు. సంప్ర॥ సెల్ : 9030093554

AJY_

కావలెను

★ SNEHA FOODS, బ్రెడ్ కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్ కావలెను. నల్లగొండ పట్టణములో నివసించువారు మాత్రమే సంప్రదించగలరు. IDA-Nalgonda. Cell : 99669 45449, 10 AM to 6.00 PM

AJY_

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413656 9985413365
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 8885995946

గ్రంథాలయాలు.. మనోవికాస కేంద్రాలు



పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న యూనివర్సిటీ అడ్వైజర్ పూనం మాలకొండయ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ వైపీ దాసేశ్వర్‌రావు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విద్యార్థులకు మనో వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయని విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పూనం మాలకొండయ్య అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామశివారులోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మంగళవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా యూనివర్సిటీలోని గ్రంథాలయ కేంద్రంలో డాక్టర్ పూనం మాలకొండయ్య యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైపీ దాసేశ్వర్‌రావుతో కలిసి పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదను పెంచుకోవాలన్నారు. ఇంటర్నెట్, సోషల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాల ప్రాముఖ్యత తగ్గలేదన్నారు. ఎందుకంటే పుస్తకాలు ఇస్తున్న అమితమైన జ్ఞానం, విశ్లేషణాశక్తి, ఆలోచనా సంపత్తి అమూల్యమైందని అన్నారు. ఉన్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే మార్గం అని అన్నారు. అంతకు ముందు విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా పుస్తక ప్రదర్శన, వ్యాస రచన, క్విజ్, పోస్టర్ పోటీలను నిర్వహించారు. ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రోబాల్ జాతీయ పోటీలకు జిల్లా విద్యార్థులు



హర్షవర్ధన్, గౌతమ్, త్రివేణి, వసంత

మోత్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాదు మాదాపూరులోని సీజీఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.పూర్ణచందర్‌రాజు, మోత్కూరు యాదయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. కొడకండ్లకు చెందిన డి.గౌతమ్, మోత్కూరు ఇందిరానగర్‌కు చెందిన కె.హర్షవర్ధన్, ఆలేరుకు చెందిన డి.వసంత, బొమ్మలరామారానికి చెందిన బి.త్రివేణి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు డిసెంబరులో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో ఆడతారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను మోత్కూరు సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.తానయ్య, సాంఘీన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటమ్మ, పీఈటీలు చాంద్‌పాషా, శ్రీలత అభినందించారు.

రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాపట్ల నరహరి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): పట్టణ పాతగుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు 50ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులను స్వాగతిస్తున్నామని, ఇదే క్రమంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ వైటీడీఏ అభివృద్ధిలో భాగంగా మెయిన్‌రోడ్డు విస్తరణలో రోడ్డు బాధితులందరికీ పరిహారంతో పాటుగా ఇళ్లు, దుకాణాలు, పరిహారం ఇచ్చి ఆదుకున్నారని తెలిపారు. పాతగుట్ట రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారందరికీ నష్టపరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, దుకాణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 20వ తేదీన యాదగిరిగుట్ట పాతగుట్ట చౌరస్తా వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్‌గౌడ్, బబ్బూరి వెంకటేష్, దేవపూజ అశోక్, బుడిగె సత్యయ్య, వీరేష్, రోడ్డు బాధితులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

భువనగిరి గంజ్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, విద్యార్థులపై దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల కన్వెన్షన్ జిల్లా ఉపాధ్యక్షురాలు హిందూరాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ నిమిషానికి మహిళలపై దాడులు జరుగుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఏ చర్యా తీసుకోవడం లేదని ఆమె విమర్శించారు. సమాజంలో లింగ వివక్ష నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరూ పోరాడాలని, నిత్యం మహిళలపై జరుగుతున్న దాడులకు ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, ఈర్ల రాహుల్, ఎండీ నేహాల్, ఈర్ల కార్తీక్, రజిత, వెన్నెల, ప్రశాంతి, నిహారిక, పూజ, ప్రసన్న, భవిత, రామేశ్వరి, ప్రసన్న, అక్షిత, దుర్గా, మానస తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏ చెల్లించాలి

వలిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు వైవీఎస్.రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వైవీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బందారపు లింగస్వామి పర్యవేక్షణలో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు కొట్లపల్లి స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉక్కుర్తి లక్ష్మణ్, గోపి, శ్రీధర్, సంజీవ, ప్రవీణ్, లక్ష్మారెడ్డి, వేణురెడ్డి, వెంకటేశం, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

వలిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో జలేందర్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మండలంలోని అరూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను లబ్ధిదారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజలు



ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిలోని పలు ఆలయాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని వేడుకగా జరిపారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సంప్రదాయ రీతిలో పడిపూజ చేసి భజనలు చేశారు. ఆధ్యాత్మిక క్షేత్రం స్వర్ణగిరిలో అభిషేక పూజలు, నిత్య ఆరాధన, నిత్య కల్యాణోత్సవం నిర్వహిం చారు. కల్యాణ మూర్తులకు తిరు సేవ జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువు నీటినుంచి బయటపడిన భవనాలు



చెరువు నీటి నుంచి బయటపడిన ఎంపీపీ కార్యాలయ భవనం

నిరంతర కరువుతో సతమతమయ్యే చౌటుప్పల్ పట్టణానికి ఐదేళ్లకో..పదేళ్లకో చెరువు నిండితే అతి వృష్టి. నిండకపోతే అనావృష్టి. చెరువు నిండితే ప్రభుత్వ కార్యాలయాలు, ఓ ఆలయం, శ్మశానవాటిక నీట మునిగే పరిస్థితి. ఈ ఏడాది చెరువు నిండడంతో నీటమునిగిన కార్యాలయాలు ఇటీవల వర్షాలు ఎడతెరిపి ఇవ్వడంతో తేలాయి.

● నీరు వృథా కాకుండా చర్యలు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఊర చెరువు అలుగు నుంచి బయటకు ఎక్కువ నీరు వెళ్లిపోకుండా సోమవారం సాయంత్రం ఒక చోట అడ్డు కట్ట వేశారు. చెరువు నీటిలో మునిగిన ఎంపీపీ కార్యాలయం, శ్మశాన వాటిక, అయ్యప్ప స్వామి దేవాలయం, రెండు ఇళ్లు బయట పడడంతో పాటు నీటి మట్టం కూడ తగ్గిపోతుండడంతో మనిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. చెరువు అలుగు ప్రాంతం అస్తవ్యస్తంగా ఉండడంతో నీరు ఎక్కువ భాగం బయటకు వెళ్లిపోతోంది. ఈ పరిణామంతో కొద్ది రోజుల్లోనే చెరువు ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఒక వేళ చెరువు ఖాళీ అయితే మాత్రం పట్టణంలో మళ్లీ తాగు నీటి సమస్య తప్పదు. ఈ సమస్య ను దృష్టిలో పెట్టుకొని కమిషనర్ సమయస్ఫూర్తితో వ్యవహరిస్తున్నారని, చెరువు నుంచి వెళ్లిపోతున్న నీటికి అడ్డు కట్ట వేయించడం సముచిత నిర్ణయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

యథావిధిగా కార్యకలాపాలు

చెరువులో మునిగిన ఎంపీపీ కార్యాలయం, శ్మశాన వాటిక, అయ్యప్ప స్వామి దేవాలయం బయట పడ్డాయి. వాటిలో యథావిధిగా కార్యకలాపాలు జరుగుతున్నాయి.

నీటిని ఒడిసిపట్టకుంటే మళ్లీ క్షామమే

అలుగు ప్రాంతం ధ్వంసం కావడంతో చెరువు నీరు వృథాగా బయటకు వెళ్లిపోతోంది. ఈ నీటికి అడ్డుకట్ట వేయవలసిన పరిస్థితి ఏర్పడింది. లేని పక్షంలో చెరువు ఖాళీ కానుంది. అదే జరిగితే మళ్లీ పట్టణంలో కరువు సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అలుగు ప్రాంతంలో ఒక చోట మట్టికట్ట వేశారు. దీంతో బయటకు వెళ్లే నీటి ప్రవాహం కొంత మేరకు తగ్గిపోయింది. మరో రెండు ప్రాంతాల నుంచి చెరువు నీరు బయటకు వెళ్లిపోతోంది. ఇక్కడ కూడా యుద్ధప్రాతిపదికన అడ్డు కట్ట వేసి చెరువు నీటి సంరక్షించాలని పలువురు కోరుతున్నారు. కాగా మునిసిపల్ కమిషనర్ చెరువుకట్ట ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. అలుగు ధ్వంసమైన చోట తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీరు వృథా కాకుండా చూస్తామని తెలిపారు.

మూడేళ్లుగా నీటి ఎద్దడి

కరువు సమస్య తో మూడు సంవత్సరాల పాటు పట్టణంలోని హనుమాన్‌నగర్, రత్నానగర్, ఎల్లారెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజలు తాగు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోని బోరు బావులు ఎండిపోవడం, కొత్తగా 1000 అడుగుల లోతుగా బోరు బావులు డ్రిల్ చేసినా నీరు కనిపించని పరిస్థితి నెలకొంది. కాలనీల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు మునిసిపల్ సిబ్బంది 24గంటలు శ్రమించవలసి వచ్చింది. మునిసిపల్ కార్యాలయంపై ఆర్థిక భారం కూడా ఎక్కువగా పడింది. ట్యాంకర్ల నీటికోసం ప్రజలు పడిగాపులు పడవలసి వచ్చింది. తప్పని పరిస్థితుల్లో కొందరు రూ.600 నుంచి రూ.800 వరకు వెచ్చించి ట్యాంకర్ నీటిని కొనుగోలు చేసేవారు. శుభకార్యాలతో పాటు అత్యవసర సమయాలలో ఈ ధర రూ.1000 వరకు పలికింది. గత నెలలో కురిసిన వర్షాలతో చెరువు నిండి అలుగు పారడంతో పట్టణ ప్రజలు ఒక్క సారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇక రెండు, మూడు సంవత్సరాల పాటు నీటి సమస్య రాదన్న ధైర్యంతో ప్రజలు ఉన్నారు.



చెరువు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి

ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక

తుర్కపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంహెచ్ఎస్ఆర్‌బీ మెడికల్ బోర్డులో రిలీజ్ చేసిన మెడికల్ డిపార్ట్‌మెంట్ గ్రేడ్ - 2 పోస్టుల ఫలితాల్లో తుర్కపల్లి మండలం సంగ్యాతండాకు చెందిన దీరావత్ మమత ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. మమత ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై ఆమె తండ్రి సర్వన్‌నాయక్ సంతోషం వ్యక్తం చేసాడు. మమతను తండా వాసులు అభినందించారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో పత్తిపంట నష్టపోవడంతో ఆత్మహత్య చేసుకున్న రైతు ఇటికాల ఉపేందర్‌రెడ్డి కుటుంబానికి టీపీసీసీ నాయకులు చల్లమల్ల కృష్ణారెడ్డి ప్రకటించారు. ఆయన పంపిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని మంగళవారం ఉపేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు స్థానిక నాయకులు అందజేశారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

తుర్కపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పార్మర్‌పై ఓవర్ లోడ్ సమస్యను పరిష్కరించాలని మంగళవారం మండలంలోని దత్తాయపల్లిగ్రామానికి చెందిన రైతులు తుర్కపల్లి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ వెంకటాచారికి వినతి పత్రం అందజేసారు. గ్రామంలోని జాలు వావి కట్ట సమీపంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్ పై ఓవర్ లోడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

బునాదిగాని కాల్వ పనులు వేగవంతం చేయాలి



పులిగిల్లలో ఇంటింటి సర్వేలో సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

వలిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బునాదిగాని కాల్వ పనులను వేగవంతం చేసి, యాసంగి పంటకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పులిగిల్ల, దాసిరెడ్డిగూడెం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామీణ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బునాదిగాని కాల్వ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో ఎప్పటి వరకు పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం అధికారులు స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి పనులు వేగవంతం చేయాలని పనులు చేసే కాంట్రాక్టర్‌కు నిధులు వెంటనే చెల్లించాలని కోరారు. గ్రామీణ వృద్ధులకు పెన్షన్ రాలేదని 65 సంవత్సరాలకు పెన్షన్ మంజూరు చేస్తామన్న నిబంధనను ఎత్తివేసి 57 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఇవ్వాలని, మహిళలకు రూ. 2500 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతిరెడ్డి, పీఏస్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు తుర్కపల్లి సురేందర్, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, నాయకులు నర్సింహ, నాగరాజు, బిక్షపతి, సత్తిరెడ్డి, వెంకటయ్య, యాదయ్య, రవి, మధు, ముత్యాలు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : పంచాయతీలు, స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో గ్రామ సమస్యలపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ నాయకులు రాజమల్ల సత్తయ్య, తుమ్మల సత్యనారాయణరెడ్డి, బుచ్చయ్య, నర్సయ్య, లక్ష్మయ్య, చారి పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని రాగిబావి గ్రామంలో నిర్వహించిన సర్వేలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు పసునూరు చంద్రారెడ్డి, లక్ష్మీనర్సింహస్వామి, పి.రమేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని మునిపంపుల మధిర గ్రామం తుమ్మబావిగూడెంలో నిర్వహించిన సర్వేలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు కల్లూరి నగేష్, అప్పం సురేందర్, గంటిపాక శివకుమార్, జంపాల ఉమాపతి, పావిరాల మత్స్యగిరి, కట్ట అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్

భువనగిరి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని వాత్సల్య గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ దరిపల్లి నవీన్‌కుమార్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అనంతారం శివారులో గల వాత్సల్య ఇన్‌స్టిట్యూషన్స్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల పూర్వ విద్యార్థి, ఫుడ్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ వెంకట్రాం మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, నైతికత ,సంస్కార విలువలు, క్రమశిక్షణ ఈ కళాశాలలోనే నేర్చుకున్నానన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ బీవీ.రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి సురేశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వెంకటేశ్వర్లు, కరుణాకర్, నర్మద, రేఖ, పరమేశ్వరి, నరేందర్‌రెడ్డి, రామాంజనేయులు, శృతి, అనూష, చంద్రశేఖర్, జ్యోతి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణంతో ప్రజల రాకపోకలకు సౌకర్యం

చౌటుప్పల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లింగోజీగూడెం ఎస్సీ కాలనీ నుంచి హైవే వరకు నిర్మించే బీటీ రోడ్డుతో ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ జి.వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. దివీస్ సంస్థ కేటాయించిన రూ. 55లక్షల సీఎస్సార్ నిధులతో లింగోజిగూడెం ఎస్సీ కాలనీ (3వ వార్డు) నుంచి 65వ నంబరు జాతీయ రహదారి వరకు 3 కి. మీటర్ల పొడవున చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి సాంకేతిక సమస్యలను కమిషనర్ మంగళవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఏఈఈ నితీష్ కుమార్, పర్యావరణ ఇంజనీరు రేణుకుమార్, దివీస్ సంస్థ ప్రతినిధి గోపి, వార్డు ఆఫీసర్ రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సునీల్, సంతోష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అంతం అందరి లక్ష్యం కావాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తి

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల అంతరం అందరి లక్ష్యం కావాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.విష్ణుమూర్తి అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం భువనగిరిలో ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, మాట్లాడారు. నేడు సమాజానికి అత్యంత ప్రమాదకరమైనది డ్రగ్స్ వినియోగమని అన్నారు. డ్రగ్స్‌తో యువత చెడు మార్గంలోకి వెళుతున్నారని, ఫలితంగా వారి భవిష్యత్తు ప్రమాదకరమవుతుందని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ చిత్తశుద్ధితో ప్రయత్నించాలని అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ జి రామలింగం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఆలేరు : మాదక ద్రవ్యాల నిరోధకానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ అంజనేయులు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మునిసిపల్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధకంపై నిర్వహించిన సామూహిక ప్రతిజ్ఞ నిర్వమించారు.

ఆత్మకూరు(ఎం):తహసీల్దార్ లావణ్య, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, ఎంపీవో శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

రామన్నపేట: సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీవో రాములు, రామన్నపేట, వలిగొండ, అడ్డగూడూరు ఎస్ఐలు నాగరాజు, యుగేందర్, వెంకట్‌రెడ్డి, జీజేసీ ప్రిన్సిపాల్ జగదీష్ ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి: జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం సిరికొండ నర్సింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పాఠశాల స్థాయి నుంచే తమ భవిష్యత్తు గురించి గట్టి పునాదులు వేసుకోవాలని సీడబ్ల్యూసీ మెంబర్ కునగల మల్లేశం విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ట్రోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు.

దత్తగిరి ఆశ్రమంలో కోటి భగవద్గీత పారాయణం

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో కోటి భగవద్గీత పారాయణంలో భాగంగా మంగళవారం భూదాన్‌పోచంపల్లి మండలం హైదర్‌పూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో భక్తులు భగవద్గీత పారాయణం నిర్వహించారు. గణపతి సచ్చిదానందస్వామిజీ శిష్య బృందం గొర్తి అన్నపూర్ణ, ఎస్.రూప, ఉషారాంకుమార్ నేతృత్వంలో మహిళా భక్తులు భగవద్గీత పారాయణ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 పర్వాల్లోని శ్లోకాలను వారు సామూహిక పారాయణంచేశారు. గీతా పారాయణంతో భక్తుల మానసిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో రుద్ర బాలమణి బాలరాజు, ఎస్ అరుణ, లక్ష్మీ రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా నేత చింతల భూపాల్‌రెడ్డి కన్నుమూత



భూపాల్‌రెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



భూపాల్‌రెడ్డి(ఫైల్)

చౌటుప్పల్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, సీపీఎం జిల్లా నాయకుడు చింతల భూపాల్‌రెడ్డి (70) మంగళవారం మృతి చెందాడు. దీంతో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భూపాల్‌రెడ్డి హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. ఈ ప్రాంతంలో సీపీఎం బలోపేతానికి, రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి భూపాల్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని పలువురు అభిప్రాయపడ్డారు. 2001 నుంచి 2006 వరకు చౌటుప్పల్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, 2014నుంచి 2019 వరకు ఎంపీటీసీగా బాధ్యతలను నిర్వహించి ప్రజల మన్ననలను పొందారు. భూపాల్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి (మాజీ ఎంపీటీసీ) అనారోగ్య సమస్యలతో 2020లో మరణించగా, వీరి చిన్న కుమారుడు క్రాంతికుమార్‌రెడ్డి 2019లో విద్యుదాఘాతంతో మృతి చెందారు. పెద్ద కుమారుడు విప్లవ్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. కాగా విజయలక్ష్మిని భూపాల్‌రెడ్డి ఆ కాలంలోనే ఆర్భాటం లేకుండా దండలు మార్చుకుని ఆదర్శ వివాహం చేసుకున్నారు. చౌటుప్పల్ పట్టణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు చింతల భూపాల్ రెడ్డి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని, తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు.

భూపాల్‌రెడ్డి మృతి ప్రజా పోరాటాలకు లోటు: జాన్‌వెస్లీ

చింతల భూపాల్ రెడ్డి మృతి ప్రజా పోరాటాలకు తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. పట్టణంలోని ఆయన నివాస గృహంలో భూపాల్‌రెడ్డి మృత దేహంపై జాన్ వెస్లీ పూలమాల వేసి నివాళులర్పించారు. భూపాల్‌రెడ్డి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు ఉజ్జిని యాదగిరిరావు, జూలకంటి రంగారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి , మండల, పట్టణ కార్యదర్శులు గంగదేవి సైదులు, గోశిక కరుణాకర్, దండ అరుణ్‌కుమార్ నివాళులర్పించారు. కాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భూపాల్‌రెడ్డి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మునుగోడు అసెంబ్లీ ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ , మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సుర్వి నర్సింహగౌడ్ ఉన్నారు.

మద్యం దుకాణాలను పట్టణానికి దూరంగా తరలించాలి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను పట్టణానికి దూరంగా తరలించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విష్ణుమూర్తిని కలిసి వివిధ యువజన సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలోని నేతాజీ యువజన సంఘం గౌరవాధ్యక్షుడు సార బాలయ్యగౌడ్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి ఆధ్వర్యంలో వివిధ యువజన సంఘాల ప్రతినిధులు, కులసంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. పర్యాటకులు, చేనేత వస్త్ర వ్యాపారులు పోచంపల్లి పట్టణాన్ని సందర్శిస్తుంటారని, ప్రధాన రహదారులపై మద్యం దుకాణాలు ఉండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు.

'ఇందిరమ్మా'.. ఇదేమిటమ్మా!

(5వ పేజీ తరువాయి)

ఒకరిని మించి మరొకరు దరఖాస్తులు చేయిస్తున్నారంటున్నారు. అధికారులు దరఖాస్తులు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తే వారు అనర్హులంటూ ఎదుటి వర్గీయులు ఫిర్యాదులు చేస్తుండటంతో ఎటూ తేల్చుకోలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎమ్మెల్యే సామేలు కూడా రెండు వర్గాలు చెరో 10 మంది లబ్ధిదారులను సూచించాలని చెప్పినా సమస్య కొలిక్కి రావడం లేదంటున్నారు. వారి ఆధిపత్య పోరులో తమకు ఇందిరమ్మ ఇళ్లు రాక నష్టపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులను ఎంపిక చేయాలని కోరుతున్నారు.

గుడిసెలో ఉంటున్నా



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నేను ఇందిరమ్మ ఇంటి కోసం ఇప్పటికి మూడు సార్లు దరఖాస్తు చేసుకున్నా. నాకు రాజకీయాలు తెలియవు. మాది వ్యవసాయ కూలి కుటుంబం. నాకు భర్త, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. మేము గుడిసెలో ఉంటున్నాం. మాకు స్వంత భూమి లేదు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే కట్టుకుని స్వంత ఇంటిలో ఉండవచ్చని ఆశపడుతుండగా మా గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లే ఇవ్వలేదు. కారణమేమిటో నాకు తెలియదు.

-అన్నెపర్తి సుమలత, దరఖాస్తుదారు, పొడిచేడు

ఒకట్రెండు రోజుల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తాం



పొడిచేడు గ్రామానికి 20 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం. ఇళ్ల కోసం దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి కొంత విచారణ జరిపాం. ఒకట్రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తాం.

-డి.బాలాజీ, ఎంపీడీవో, మోత్కూరు